క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులో మంగళవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నామని ఏఈ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సీతారామ థియేటర్ నుంచి డోలపేట చెక్‌పోస్టు వరకు ఈ అంతరాయం ఉంటుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జోరుగా సీసీ కాలువల నిర్మాణం



రంగారాయపురంలో నిర్మిస్తున్న కాలువలు

సంతకవిటి: మండలంలోని వాసుదేవపట్నం పంచాయతీ, రంగరాయపురం గ్రామంలో సీసీ కాలువల నిర్మాణం జోరుగా జరుగుతోంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన దాదాపు రూ.5 లక్షల నిధులతో ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ పప్పల గణపతిరావు తెలిపారు.

విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు



చిన్నారికి హెచ్‌బీ టెస్ట్ చేస్తున్న వైద్య సిబ్బంది

సంతకవిటి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్నారు. మండల వైద్యాధికారి యు.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులందరికీ హెచ్‌బీ పరీక్షలు చేయడంతో పాటు ఎత్తు, బరువు కూడా చూస్తున్నామన్నారు. దీని ద్వారా రక్తహీనతతో బాధపడే వారిని గుర్తించడం జరుగుతోందన్నారు. పాఠశాలల్లో ప్రతీ గురువారం ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లు అందిస్తున్నామన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ రవికుమార్

బొబ్బిలి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పోతుల రవికుమార్ సూచించారు. జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సోమవారం సమావేశమైన ఆయన గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం చేసి, ప్రజలు వ్యాధుల బారినపడకుండా చూడాలని తెలిపారు. అనంతరం స్పందన కార్యక్రమం నిర్వహించి, పలువురు సమర్పించిన వినతులను పరిశీలించి, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రిటైర్డ్ ఆర్‌ఎంఓకు సన్మానం



చంద్రశేఖర్‌నాయుడు దంపతులను సత్కరిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

రాజాం: స్థానిక ఏరియా ఆస్పత్రి ఆర్‌ఎంఓగా విధులు నిర్వహించి, ఇటీవల పదవీ విరమణ చేసిన డాక్టర్ మహంతి చంద్రశేఖర్‌నాయుడును సోమవారం ఘనంగా సన్మానించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది ఆయన సేవలను ప్రశంసించారు. అనంతరం చంద్రశేఖర్‌నాయుడు దంపతులను దుశ్శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు ప్రధాన్, సత్య శ్రీనివాస్, ప్రసాద్, కరణం హరిబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బందోబస్తు నడుమ ప్రహరీగోడ కూల్చివేత



జేసీబీతో ప్రహరీ గోడ తొలగిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చీపురుపల్లి రోడ్డులో పెండింగ్‌లో ఉన్న కాలువల పనులు పూర్తికి అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం పోలీస్ బందోబస్తు నడుమ కాలువ పనులకు అడ్డంకిగా ఉన్న ప్రహరీ గోడను మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, ఆర్‌అండ్‌బీ ఏఈ నాగభూషణరావుల సమక్షంలో కూల్చివేశారు. గతంలో పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ సంబంధిత యజమానులు స్పందించకపోవడంతోనే ఇలా తొలగించామని అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రదేశంలో మరోసారి మార్కింగ్ వేసి, కొలతల ప్రకారమే పనులు చేపడుతున్నామన్నారు.

పేదలకు పథకాలిస్తే ప్రతిపక్షాలకు కడుపుమంట

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: పేదలకు పథకాలు ఇస్తే ప్రతిపక్షాలకు ఎందుకంత కడుపుమంట అని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ప్రశ్నించారు. మండలంలోని కమ్మవలస గ్రామంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు బాగుండాలన్న సదుద్దేశ్యంతోనే అందరికీ మేలు జరిగేలా ఆయన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందించడం జరుగుతోందని, ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. ఓవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమం జరుగుతుంటే ఓర్వలేని టీడీపీ, జనసేన పార్టీలు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే ప్రజలెవరూ వారి ఆరోపణలను నమ్మడం లేదన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరగలేదని, ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్. లక్ష్మి, జెడ్పీటీసీ ఎస్.శాంతకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాల నాయుడు, ఎంపీడీఓ పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వనరులు కలుషితం కాకూడదు

- ఎమ్మెల్యే కంబాల జోగులు



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: వర్షాకాలంలో తాగునీటి వనరులు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎమ్మెల్యే కంబాల జోగులు సూచించారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఏవీఎస్ రాజన్, డీఈఈ కె.రాజేష్‌తో పాటు నాలుగు మండలాల జేఈలతో ఎమ్మెల్యే సమావేశమై, నియోజకవర్గంలో జరుగుతున్న జలజీవన్ మిషన్ పనులతో పాటు తాగునీటి బోర్లు, రక్షిత మంచినీటి పథకాల పనితీరుపై ఆరాతీశారు. వర్షాకాలంలో ఎక్కువగా పైపులైన్లు లీకులకు గురయ్యే అవకాశం ఉందని, అధికారులు ఈ సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే స్పందించాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, గ్రామాల వారీగా పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయించాలన్నారు. అనంతరం నియోజకవర్గంలో ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జేఈలు వి.జగన్‌మోహనరావు, సంతోష్‌కుమార్, శ్రీచరణ్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయాలి

తెర్లాం: గ్రామీణ క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంను విజయవంత చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహణపై పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశమైన ఆయన అక్టోబర్ 2వ తేదీ నుంచి కార్యక్రమం ప్రారంభం కానుందని, గ్రామీణ ప్రాంతాల్లో ఆసక్తి ఉండి, 17 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఆటల పోటీలపై గ్రామాల్లోని యువతీ, యువకులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, క్రికెట్ తదితర పోటీలు నిర్వహించనున్నామని, వీటికి అవసరమైన కిట్లు ప్రభుత్వమే సరఫరా చేస్తుందన్నారు. క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎంఈఓ త్రినాథరావు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధం



అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

- ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలి
- ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: సచివాలయ భవన నిర్మాణాలు చేస్తున్న కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీరాజ్ అధికారులతో సమావేశమైన ఆయన గ్రామాల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. మండల వ్యాప్తంగా 25 సచివాలయాలు నిర్మిస్తుండగా, వీటితో ఐదు నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయని, మరో 12 నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయని డీఈఈ జయప్రకాష్ తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నాటికి ఆరు గ్రామ సచివాలయాల నిర్మాణాలను పూర్తిచేసి, ప్రారంభానికి సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం గ్రామాల్లో నిర్మిస్తున్న సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్‌ల భవనాలు చాలా అవసరమన్నారు. వీటి నిర్మాణానికి సర్పంచ్‌లు కూడా ముందుకు రావాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహణ సమయంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 లక్షల నిధులతో పరిష్కరించాలని తెలిపారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అన్నివర్గాల ప్రజలు బాగుండాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జి. వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్ మోహనరావు, ఎంపీడీఓ నాగమణి, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి, పంచాయతీరాజ్ జేఈ వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తుల మేరకే పనులు

- మున్సిపల్ సాధారణ సమావేశంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఎస్వీ మురళీకృష్ణారావు, చెలికాని మురళి



ప్రతిపక్ష సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ మురళి

బొబ్బిలి: ప్రజలు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తుల మేరకే స్థానిక గొల్లవీధి నుంచి ఆర్‌టీసీ కాంప్లెక్స్ వరకు రాజాం రోడ్డు పనులు ప్రారంభించామని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైస్ చైర్మన్ చెలికాని మురళి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో పాల్గొన్న వీరు.. ప్రతిపక్ష సభ్యుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. అజెండాలో రోడ్డు మరమ్మతుల విషయం చదువుతుండగా, ప్రతిపక్ష ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు ఈ విషయాన్ని కౌన్సిల్‌లో ముందు పెట్టకుండా ఆదివారం పనులు ప్రారంభించినప్పుడు తమకు చెప్పడమేంటని అడిగారు. స్పందించిన వైస్ చైర్మన్ తన వార్డు ప్రజల వినతి మేరకే పనులు చేపట్టామని, ఇది తప్పా అని అన్నారు. ఈ రోడ్డు విస్తరణ కోసం రూ.34.50 కోట్ల నిధుల మంజూరుకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఆ నిధులు వచ్చేలోపు ఈ రోడ్డు పనులు జరగడం ముఖ్యం కాదా అని ఎదురు ప్రశ్నించారు. ఆస్పత్రి రోడ్డు వెడల్పుకు రూ.10 కోట్ల నిధులు ఎమ్మెల్యే శంబంగి ఆధ్వర్యంలో మంత్రి బొత్స సత్యనారాయణ ద్వారా వచ్చిన విషయం తెలీదా అన్నారు. మరో కౌన్సిలర్ అమ్మఒడి నిధులు తగ్గుతున్నాయని, రోడ్డు బిల్లులు ఎప్పుడవుతాయని ప్రశ్నించగా, అమ్మఒడికి, రోడ్డు పనులకు లింకు పెట్టడం సమంజసం కాదన్నారు. పాతబొబ్బిలి చెరువు పనులు చేపట్టాలని అక్కడి కౌన్సిలర్ చోడిగంజి రమేష్‌నాయుడు కోరగా, దశల వారీగా పనులు చేద్దామని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు తెలిపారు. ఇదిలా ఉండగా, ఐదో వార్డులో తాగునీటి కుళాయిల లీకుల ద్వారా పురుగులు వస్తున్నాయని, మరమ్మతులు చేయించాలని కౌన్సిలర్ వెలగాడ హైమావతి కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమాదేవి, కౌన్సిలర్లు ఐ.గోవిందరావు, ఎస్.బాబు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో కళ్లకలకల వ్యాధి దూరం

రాజాం సిటీ: సకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కళ్లకలకల వ్యాధి నుంచి దూరం కావచ్చని ఆప్తాలమిక్ అధికారి సప్పటి వసంతరావు అన్నారు. సోమవారం మండలంలోని కంచరాం సృజన విద్యాలయంలో కళ్లకలకల వ్యాధి, నివారణ చర్యలపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. రోజుకు నాలుగు నుంచి ఆరుసార్లు మంచి నీటితో కళ్లను పరిశుభ్రం చేసుకోవాలని తెలిపారు. వైద్యుల సలహా మేరకు కంటి చుక్కల మందు వినియోగించాలన్నారు. వాడిన రుమాలు, టవల్స్, సబ్బులు వాడకూడదన్నారు. సి-విటమిన్ ఉన్న పండ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు.

సోషల్ ఆడిట్‌కు సహకరించాలి



బొబ్బిలి: మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీవేణుగోపాలనాయుడు



బాడంగి: సూచనలిస్తున్న జెడ్పీటీసీ రామారావు

బొబ్బిలి: సోషల్ ఆడిట్‌కు సహకరించాలని ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు కోరారు. ఇదే విషయమై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశమైన ఆమె గడిచిన ఏడాది కాలంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి, ఆడిటర్లు గ్రామాల వారీగా ఆడిట్ నిర్వహిస్తారని, దీనికి మీ అందరూ సహకరించాలని తెలిపారు. ఆడిట్ ఎంత బాగా జరిగితే పనుల్లో అంత పారదర్శకత, నాణ్యత పాటించినట్లు అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ ఎస్.శాంతకుమారి, ఎంపీడీఓ పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 12 వరకు ఆడిట్..

బాడంగి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆగస్టు 12వ తేదీవరకు ఉపాధి హామీ పనుల ఆడిట్ జరగనుందని, దీనికి ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని జెడ్పీటీసీ పెద్దింటి రామారావు కోరారు. ఇదే విషయమై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో సమావేశమైన ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు. ఎంపీడీఓ ఆంజనేయులు మాట్లాడుతూ ఆడిట్ సిబ్బందికి గ్రామాల్లో ఉండేందుకు సౌకర్యం కల్పించాలని కోరారు. ఎస్ఆర్‌పీ మాధవరావు మాట్లాడుతూ 2022-23 ఏడాదికి గాను 1,081 పనులు జరిగాయని, దీనికోసం రూ.12.97 కోట్ల మేర ఖర్చు అయిందన్నారు. ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

- జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అధికారులు



తెర్లాం: స్పందన సమస్యలపై మండల స్థాయి అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ



రాజాం: మండల స్థాయి అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు



మెంటాడ: ఎంపీడీఓ త్రివిక్రమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా నేత నాగమణి

తెర్లాం: జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను గడువులోగా పరిష్కరించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి సమర్పించిన వినతిపత్రాలను పరిశీలిలించారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించొద్దని, సాధ్యమైనంత వరకు త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. వచ్చే వారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి గతవారం వచ్చిన సమస్యలు రాకూడదన్నారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రామభద్రపురం: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఈ కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీఓ సూపరింటెండెంట్ అక్కారావు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి స్పందన కార్యక్రమానికి హాజరైన ఆయన మండల స్థాయి అధికారులను ఉద్దేశించి, కాసేపు మాట్లాడారు. సమస్య ఏదైనా కారణం చేత పరిష్కారం కాకపోతే ఆ విషయాన్ని అర్జీదారుకి తెలపాలన్నారు. శాఖల వారీగా అధికారులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

కూనేటి గెడ్డపై వంతెన నిర్మించండి..

మెంటాడ: కొండలింగాలవలసకు వెళ్లే దారిలోని కూనేటి గెడ్డపై వంతెన నిర్మాణం చేపట్టాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సాలూరు నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు సిరిపురపు నాగమణి కోరారు. ఇదే విషయమై ఆమె స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమానికి హాజరై, ఎంపీడీఓ త్రివిక్రమ్‌ను కలిసి, వంతెన నిర్మాణమై వినతిపత్రం సమర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆమె గతంలో నిర్మించిన కాజ్‌వే పూర్తిగా శిథిలమైపోయిందని, ఇటీవల కురిసిన వర్షాలకు గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో గ్రామానికి రెండు రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయాయన్నారు. అలాగే మధుర గ్రామమైన గజంగుడ్డివలసలో ప్రభుత్వ పాఠశాల భవనం పూర్తిగా పాడైపోయిందని, నాడు-నేడు నిధులతో మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరామన్నారు.

రాజాం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఎంపీడీఓ బాసూరి శంకరరావు మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు, మురుగుకాలువల నిర్మాణంపై దృష్టిసారించాలని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో మౌలిక వసతుల కల్పించాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ జేఈ ప్రభాకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జగన్‌మోహనరావు, ఏపీఓ సాయిరాం, ఏపీఎం దధికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫార్మేటివ్ పరీక్షలు

బాడంగి: ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం నుంచి ఫార్మేటివ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ పి.లక్ష్మణ దొర తెలిపారు. ఇదే విషయమై స్థానిక ఎమ్మార్సీ భవనంలో విలేకరులతో మాట్లాడిన ఆయన మండలంలో మొత్తం 48 పాఠశాలలు ఉండగా, ఇప్పటికే ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు సరిపడ ప్రశ్నపత్రాలు సిద్ధం చేశామన్నారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రెండు రోజులు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నాలుగు రోజుల పాటు ఈ పరీక్షలు ఉంటాయన్నారు. ఏ రోజు పరీక్షకు సంబంధించి, ఆ రోజే ప్రశ్నపత్రాలను పాఠశాలల సిబ్బంది తీసుకువెళ్లాలని తెలిపారు. అనంతరం సీఆర్‌పీలు నాగమణి, రామకృష్ణ, వెంకటరమణ ప్రశ్నపత్రాలు సిద్ధం చేస్తుండడాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలకు డిమాండ్

బొబ్బిలి: నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలకు ఏఐఎస్ఎఫ్(ఆలిండియా స్టూడెంట్ ఫెడరేషన్) డిమాండ్ చేస్తోంది. ఇదే విషయమై స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ నేతలు, విద్యార్థులు సోమవారం ధర్నా చేపట్టారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న, ప్రభుత్వ అనుమతి లేకుండా వసతిగృహాలు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ డోల రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హరికృష్ణ, పోలిరాజు, శివ, శరత్, వంశీ, గీత, జ్యోతి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



మరువాడలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు

వంగర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మరువాడ గ్రామంలో సోమవారం పర్యటించిన ఆయనకు సర్పంచ్ గాడి క్రిష్ణవేణి, గాడి మధుల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి, ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందన్నారు. అర్హతే ప్రామాణికంగా, కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా ప్రభుత్వం పథకాలు అందజేస్తోందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. సీఎం జగనన్న తన పాదయాత్ర మొదలుకుని, ప్రజాసంకల్ప యాత్ర వరకు ఆయన ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలు అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి, ఇంటి వద్దకే ప్రభుత్వ పాలన అందించారని, ఎంతోమంది నిరుద్యోగ యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పించారన్నారు. నవరత్నాల పథకాలతో పాటు ఇతర సంక్షేమ పథకాల ద్వారా గడిచిన నాలుగేళ్లలో దాదాపు రూ.3 లక్షల కోట్ల రూపాయలను ప్రజల ఖాతాల్లోకి డీబీటీ విధానం ద్వారా జమ చేశారని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి, ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, వాటిని నమ్మవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కె.సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



వాహనదారులు, ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ జయంతి

బాడంగి: ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్ఐ ఆర్.జయంతి కోరారు. మండలంలోని వూడివలస జంక్షన్ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై సోమవారం అవగాహన కల్పించారు. అటువైపుగా ఓవర్‌లోడుతో వస్తున్న ఆటోలను ఆపి, అందులో ఉన్న వారిని వాహనాల నుంచి దింపేశారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులు ఉండరాదని, ఓవర్‌లోడుతో లగేజి వాహనాలు నడపకూడదని సూచించారు. అలాగే సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. ప్రతీ వాహనదారుడు వాహనంతో రోడ్డు మీదకు వచ్చినప్పుడే వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని తెలిపారు.